జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 5-11-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 502 పేజీలు: 4 వెల : రూ.7


## తొక్కిసలాటకు.. సీఐ వైఫల్యమే..

# కారణమా?



* ఆరోజు ఉదయమే ఎస్పీ సెట్‌లో పోలీసు అధికారులకు ఆదేశాలు
* బందోబస్తుకు ముగ్గురు పోలీసులను వేంకటేశ్వర స్వామి ఆలయానికి పంపించిన సీఐ
* మొదటి నుంచి కాశీబుగ్గ సీఐ వైఖరిపై విమర్శలు
* అధికార పక్షానికి కొమ్ముకాస్తున్నట్టు ప్రతిపక్షాలు బహిరంగ ఆరోపణలు
* సీఐ తీరుతో పోలీస్ బాస్‌కు తలనొప్పి
* సీఐని తప్పించాలని రోజురోజుకూ సామాజిక మాధ్యమాల్లో డిమాండ్







**శ్రీకాకుళం క్రైం, నవంబరు 4 (వార్త):** కార్తీక ఏకాదశి రోజున పెద్ద ఎత్తున భక్తులు ఆలయాలకు వస్తారని, పోలీసులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, బందోబస్తు పకడ్బందీగా చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆరోజు ఉదయం ఏడు గంటలకు సెట్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను కాశీబుగ్గ సీఐ పెద్దగా పట్టించుకోలేదు. సరికదా ముగ్గురిని మాత్రమే వెంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు బందోబస్తుకు పంపించారు. పెద్ద ఎత్తున భక్తజనం వేంకటేశ్వర స్వామి ఆలయానికి వస్తారని తెలిసి కూడా తక్కువమంది పోలీసులను బందోబస్తుకు పంపించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రద్దీని అదుపు చేయడంలో సీఐ చూపిన తీవ్ర నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం లెక్కచేయని ఈ వైఖరిపై శాఖాపరమైన చర్యలు తప్పవని తెలుస్తోంది. మొదటి నుంచి ఆ సీఐ తీరుపై విమర్శలు ఉన్నాయి. కేసులు రాజీ చేయడం, ప్రతిపక్షాలపై కన్నెర్ర చేయడం, కేసులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ.. శాంతిభద్రతల పరిరక్షణలో ఉండదని, అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే పనిచేస్తారని వైసీపీ నేతలైతే బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో కూడా ఈ సీఐపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు ఆ శాఖలోని కొందరు బయట గుసగుసలాడుకున్నారు. ఈ తొక్కిసలాట ఘటనకు పోలీసుల నిఘా వైఫల్యం కూడా ఒక కారణమని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నిజనిజాలు ఎలా ఉన్నా..

నిజనిజాలు ఎలా ఉన్నా, ఒక సాధారణ పర్వదినం సందర్భంగా భక్తుల ప్రాణాలు గాల్లో కలవడానికి పోలీసు నిఘా వైఫల్యం, ముందస్తు బందోబస్తు ఏర్పాట్ల లేమి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇది కేవలం ఒక సీఐ వైఫల్యం మాత్రమే కాదు, సామర్థ్యం లేని లేదా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గే అధికారులను కీలక స్థానాల్లో ఉంచడం యొక్క పర్యవసానం. మృతుల కుటుంబాలకు న్యాయం జరగాలన్నా, ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ఉండాలన్నా, ఈ దుర్ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి, రాజకీయ జోక్యాన్ని పక్కన పెట్టి బాధ్యులైన ప్రతి అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### ఎస్పీ టార్గెట్‌గా ఆరోపణలు..



కొంతమంది రాజకీయ నాయకులు మాత్రం జిల్లా ఎస్పీని లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఎస్పీ ముక్కుసూటిగా వ్యవహరించడం, ఎలాంటి సిఫార్సులకు తావివ్వకుండా నిబంధనలకు కట్టుబడి పనిచేయడం కొందరు కిందిస్థాయి పోలీసు సిబ్బందికి, పలాస వంటి కీలక ప్రాంతాల్లోని ప్రతిపక్ష నేతలకు నచ్చడం లేదన్నది బహిరంగ రహస్యం. ముఖ్యంగా, అక్కడ ఒక కీలక వైసీపీ నాయకుడు జిల్లా పోలీసు బాస్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ ఈ దుర్ఘటనను అడ్డం పెట్టుకుని ఆయనపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం పోలీసు వర్గాల్లో గుప్పుమంటోంది. సీఐ చేస్తున్న తప్పిదాలను ఎస్పీ మోయాల్సివస్తోందని కూడా కొందరు చెప్పుకుంటున్నారు.

## ఉపాధ్యాయురాలి సస్పెన్షన్



**మెళియాపుట్టి, నవంబరు 4 (వార్త):** బందపల్లి బందపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎంగా పనిచేస్తున్న వై. సుజాత ఇద్దరు విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వెలుగుచూసింది. దీంతో ఆ ఉపాధ్యాయురాలు సుజాతను సస్పెండ్ చేస్తూ సీతంపేట ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఆమెకు అధికారులు చార్జ్ మెమో జారీ చేశారు. ఆమె నుంచి సంతృప్తికరమైన వివరణ రాకపోవడంతో తదుపరి చర్యగా సస్పెండ్ చేస్తూ సీతంపేట ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే విచారణ అధికారిగా టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తిని నియమించారు. విచారణ అధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా తదుపరి చర్య ఉంటుందని పీవో తెలిపారు.

## కార్గో ఎయిర్‌పోర్టుకు..

# భూములు ఇవ్వం

* అధికారులతో రైతుల వాగ్వాదం * టీడీపీ నాయకులు వెళ్లిపొండని హెచ్చరిక * గందరగోళం మధ్య ప్రజాభిప్రాయ సేకరణ





**మందస, నవంబరు 4(వార్త):** కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి భూములు ఇవ్వమని ఉద్దానం ప్రజలు తెగేసి చెబుతున్నారు. ఈ తరుణంలో కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అధికా రులు మందస మండలంలో రాంపురం పంచాయతీలో గల బిడిమి రెవెన్యూ గ్రామంలోని జుత్తు జగన్నాయకులు భవనంలో పలాస ఆర్డీవో వెంకటేశ్ భూ రీసర్వే పేరిట గ్రామస్తులతో మంగళ వారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. అధికారుల పిలుపు మేరకు బిడిమి రెవిన్యూ గ్రామంలో ఉన్న పెద్దబిడిమి, తిమ్మలబిడిమి, కొత్త బిడిమి, శ్రీరామ్ నగర్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. సభ ప్రారంభించే పెట్టే ముందు పలువురు రైతులు మాట్లాడుతూ బిడిమి రెవెన్యూకి సంబంధించిన రైతులు, కార్గో ఎయిర్ వ్యతిరేక కమిటీ సభ్యులైన కొమర వాసు, జోగి అప్పారావు, బత్తిని లక్ష్మణ్ తదితర నాయకులను పోలీసులు నిర్బంధించి బిడిమి రెవిన్యూ భూము లకి సంబంధంలేని వారికి ఈ మీటింగ్‌కి ఎలా అనుమతిచ్చారని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తర్వాత పోలీసులు వాళ్ళని బయటకి పంపించిన అనంతరం సభని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ కార్గో ఎయిర్ పోర్ట్ ప్రజాభిప్రాయ సేకరణ కోసం రైతులు అభిప్రాయాలు చెప్పండని అడగడంతో నాలుగు గ్రామాల్లోని రైతులు, మహిళలు ముక్తకంఠంతో మాకు కార్గో ఎయిర్ పోర్ట్ వద్దని, తక్షణమే ఈ కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం రద్దు చెయ్యాలని నినాదాలు చేస్తూ, అధికారులను ఎదిరించారు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే స్పందించి సభ సజావుగా జరిగే విధంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. బాధిత రైతులు దున్న హరికృష్ణ, జుత్తు గున్నయ్య, రెల్ల ఆనంద్, జుత్తు కుమారి, తెప్పల తులసీరావు మాట్లాడుతూ మా భూములపై మా అనుమతి లేకుండా కొలతలు వేయడమేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ కూడా మాకు తెలియకుండా మీరు కొలతలకి రావ డం ఇవన్నీ చూస్తుంటే మాకు మరింత భయాన్ని ఆందోళనకి గురి చేస్తున్నాయన్నారు. సోమవారం ఆర్.డి.ఓగా మీరు భూములు రీసర్వేకి వస్తామని చెప్పి, ఈరోజు కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణం కోసం ప్రజాభిప్రాయ సేకరణ అడగడం ఏమిటని అని రైతులు ప్రశ్నించారు. రీసర్వే చెయ్యాలంటే ముందు మేము ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే శిరీష, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, జిల్లా కలెక్టర్ మా పచ్చని ఉద్దానంలో కార్గో ఎయిర్ నిర్మాణం చేపట్టడం లేదని, మీ ద్వారా కానీ, మీడియా ద్వారా మాకు ఒక క్లారిటీ స్టేట్మెంట్ ఇస్తే తప్పకుండా భూములు రీ సర్వేకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మరి కొందరు బాధిత రైతులు మాట్లాడుతూ పలాస రైల్వే గ్రౌండ్ లో ఎమ్మెల్యే శిరీష, ఎంపీ రామ్మోహన్ నాయుడు ఏర్పాటు చేసిన సభలో ఇక్కడ జరుగుతున్న అన్యాయంపై మాకు సరైన అవగాహన లేక అభివృద్ధి కోసం భూమి ఇస్తామని చెప్పడం మా తప్పిదం జరిగిందన్నారు. ఇక నుంచి మేము కూడా గ్రామంలో ఉన్న బాధితులతో కలిసి పోరాడతామని చెప్పారు. ఆర్.డి.ఓ వెంకటేష్ స్పందిస్తూ బాధిత రైతులుగా మీరు చెప్పిన ప్రతి విషయాన్ని పై అధికారులు దృష్టిలో పెడతానని చెప్పి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మెట్టూరి నాగరత్నం, తెప్పల గున్నయ్య, జుత్తు కుర్మారావు, జుత్తు అమ్మి నాయుడు, తామడ లోకనాథం, దున్న లక్షిమోజీ, పొట్టి మోహన్ రావు, నల్ల పరుశురాం, రత్నాల భీమారావు, ఇరోతు యాదవయ్య, కొండ విశ్వనాథం, చెల్లూరి శంకర్, తిమ్మల హరిక్రిష్ణ, రత్నాల చలపతి తదితర మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## శిక్షణ సరే..

* ముందుకు సాగని మిషన్ల కొనుగోలు ప్రక్రియ
* 65వేల మందికి పైగా శిక్షణ
* మిషన్ల కోసం మహిళల ఎదురుచూపులు

# కుట్టు మిషన్లు ఏవీ?

**సరుబుజ్జిలి, నవంబరు4 (వార్త):** రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ ద్వారా 65వేల మంది మహిళలకు కూటమి ప్రభుత్వం కుట్టుశిక్షణ ఇప్పించింది. అయితే, శిక్షణ పూర్తయి నెలలు గడుస్తున్నా వారికి ఇస్తామన్న కుట్టుమిషన్లు పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి తొలుత లక్ష మంది బీసీ, ఈబీసీ మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేయాలని సంకల్పించగా 3,43,413మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 680 కేంద్రాలను ఏర్పాటుచేసి 1326బ్యాచ్‌ల ద్వారా 65,987 మందికి మొదట శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. ప్రతి జిల్లాలో ఆయా మండల/మున్సిపాలిటీల్లో అవసరమైన వసతులతో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కుట్టు మిషన్లు, ఇతర సామగ్రి సమకూర్చడంతోపాటు ఆయా సంస్థల ద్వారా అనుభవజ్ఞులైన ట్రైనర్లను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ, ఈడబ్ల్యూఎస్ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కేంద్రాలను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి సవితతో పాటు పలువురు మంత్రులు సందర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించారు. శిక్షణా కేంద్రాల్లో వసతులను ఎంపీడీవోలు పర్యవేక్షించారు. శిక్షణ పొందిన ప్రతి మహిళకూ కుట్టుమిషన్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో భారీసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. చివరికి శిక్షణకు హాజరయ్యే వారికి మాత్రమే మిషన్లు ఇస్తామని నిబంధనలు కఠినతరం చేశారు. దీంతో వాస్తవంగా శిక్షణ పొంది కుట్టుమిషన్ల ద్వారా జీవనభృతి పొందాలనుకున్న మహిళలు మాత్రమే హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న మహిళందరికీ శిక్షణ ఇచ్చే పరిస్థితులు లేకపోవడంతో వడపోతతో ఎంపిక చేశారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సిఫారసులు చేస్తుండటంతో డిమాండ్ పెరిగిపోయింది. మహిళల నుంచి ఇంకా స్పందన వస్తుండడంతో పీ4 కింద శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమకు ఇస్తామన్న ఉచిత కుట్టుమిషన్లు అందిస్తే.. తమకాళ్లపై తాము నిలబడతామని ఎదురు చూస్తున్నా, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. అడగకపోయినా తమకోసం ఏటా రూ.2వేల కోట్లు వెచ్చించి ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. ఇస్తామన్న కుట్టుమిషన్లు ఇవ్వకుండా జాప్యం చేయడం ఏంటని మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### స్వయం ఉపాధి ఊసేదీ?

మహిళల స్వయం ఉపాధికి సంబంధించి బీసీ, ఈబీసీ కార్పొరేషన్లు లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తిచేసి గత మార్చికి ముందే బ్యాంకులకు అందించింది. బీసీలకు సంబంధించి 18వేల మందికి, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా 4831 మందికి రుణాలిచ్చేందుకు బ్యాంకులు మంజూరుపత్రాలు జారీచేశాయి. జనరిక్ ఫార్మసీ షాపులు కూడా అందులో ఉన్నాయి. సబ్సిడీ నిధులు ప్రభుత్వం అందిస్తే బ్యాంకులు లబ్ధిదారులకు యూనిట్లు గ్రౌండ్ చేస్తాయి. కానీ, బీసీ సంక్షేమ శాఖ, ఈడబ్ల్యూఎస్ విభాగంలోని ఆయా కార్పొరేషన్లు గత ఏడాదికి సంబంధించి ప్రక్రియనే పూర్తి చేయకపోవడంతో, ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభించలేని పరిస్థితి ఏర్పడింది. సాంఘిక సంక్షేమశాఖ, మైనారిటీ సంక్షేమశాఖలు కూడా రుణాల ప్రక్రియ (2025-26)ప్రారంభించి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించేందుకు అడుగు ముందుకేసింది. అయితే, ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లేకపోవడంతో అవికూడా దరఖాస్తుల ప్రక్రియను నిలిపేశాయి. గిరిజన సంక్షేమశాఖ అయితే వారి వద్ద కేంద్ర ని?ధులు ఉన్నప్పటికీ ట్రైకార్ ద్వారా రుణాలిచ్చేందుకు ఒక్క అడుగూ వేయలేకపోతోంది. స్వయం ఉపాధి పథకాలను పునరుద్ధరించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీలకు రుణాలను పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో సైతం పేర్కొంది. అయినా అమల్లో వెనుకడుగు వేయడం పట్ల బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల్లో నిరాశ పెల్లుబుకుతోంది. ప్రభుత్వం ఇకనైనా చొరవ తీసుకుని శిక్షణకు అవసరమైన నిధుల విడుదలతోపాటు, ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ చేయాలని, అలాగే స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని మహిళలు కోరుతున్నారు.

### ఆర్థిక ప్రోత్సాహమేదీ?

కుట్టుమిషన్ పథకం ప్రారంభించి నాలుగు నెలలు పైబడినా ఈ శిక్షణకు అవసరమైన నిధులు మాత్రం విడుదల కావడం లేదు. బీసీ సంక్షేమశాఖ, ఈడబ్ల్యూఎస్ శాఖ అధికారులు ఆర్థికశాఖకు ఫైల్ పంపినా ఏవేవో క్వొరీలు వేసి ఒక్క పైసా విడుదల చేయడం లేదు. శిక్షణకు అవసరమైన నిధులే విడుదల చేయని అధికారులు కుట్టుమిషన్ల కొనుగోలుకు ఎప్పుడు నిధులు విడుదల చేస్తారో అని వేచి చూస్తున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## సమరయోధుల త్యాగాలపై విద్యార్థుల లఘుచిత్రం

**మందస, నవంబరు 4(వార్త):** వీరగాథ ఫైవ్ పాయింట్ జీరోలో భాగంగా ప్రభుత్వం ఆదేశానుసారం మందస మండలంలోని సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గత వీరుల చేసిన త్యాగాలకు గుర్తుగా ఒక వీడియోను రూపొందించారు.

జాతీయ పతాక ఆవశ్యకతతో పాటు దీని వెనుక గల సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ.. డొక్కరి షర్మిల, లండ దీక్షిత, బత్తుల గాయత్రి, ఎస్.రక్షిత, ఎస్.రజిత, ఇల్ల ధనలక్ష్మి, పుప్పాల పల్లవి నృత్యంతో వినూత్నంగా అభినయించారు. ఈ లఘు చిత్రాన్ని అధికారులకు పరిశీలన నిమిత్తం పంపించామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుందర్ సాల్మన్ తెలిపారు.




## గెడ్డలో పూడికల తీత



**పలాస, నవంబరు 4(వార్త):** పలాస మండలం బ్రాహ్మణతర్ల వరహాల గెడ్డలో మంగళవారం కూటమి నాయకులు పూడికలు తీశారు. ఇటీవల శక్తి, మెంథా తుఫాన్ కారణంగా గెడ్డలో కొట్టుకొచ్చిన కర్రలు, చెట్లు, ఇతర వ్యర్థాలు గెడ్డలో పేరుకుపోవడంతో కార్తీక మాసంలో మహిళలు దీపాలు పెట్టేందుకు స్నానాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన కూటమి నాయకులు నడుం బిగించారు. గెడ్డలో పేరుకుపోయిన చెత్త చెదారం, చెట్లు కర్ర దుంగలు ఇతర వ్యర్థాలను ట్రాక్టర్ సహాయంతో శుభ్రం చేశారు. అందుకు ఖర్చులను కూటమి నాయకులు ఆళ్ళ కృష్ణారావు వెచ్చించారు. కార్యక్రమంలో వడ్డీ యాదగిరి, ఆళ్ళ కృష్ణారావు, ఆళ్ల వెంకట్రావు, తామడ మోహన్రావు ఆళ్ల ధర్మారావు, ఆళ్ల జయంత్ గరికి కృష్ణారావు కొవ్వూరు ధర్మారావు, ఆళ్ల సోమేశ్వరరావు మణిగాం. శ్రీను, కొవ్వాడ గణపతి,, శాసన పూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## సీదిరి అప్పలరాజు సేవలకు సలాం



**మందస, నవంబరు 4(వార్త):** కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగిన వెంటనే మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అందించిన సేవలకు సలాం చేస్తున్నామని మందస ఎంపీటీసీ కంచి బెహరా అన్నారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అప్పలరాజు, ఆయన కలిసి అంబులెన్స్ తో అక్కడకు హుటాహుటిన చేరుకొని, క్షతగాత్రులకు అత్యవసర చికిత్స అందించారన్నారు. వైద్యునిగా ఆయన బాధ్యతనను ఎంతో సమర్థవంతంగా నెరవేర్చారన్నారు. ఆయన సేవలను ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుందన్నారు. ఒక వైద్యుడిగా సీదిరి స్పందించిన తీరు అద్భుతమని, వైద్యం ప్రజలకు చేరువవ్వడం ఎంత అవసరమన్నది ఈ సంఘటన మరోసారి రుజువు చేసిందన్నారు.

## వృత్తి విద్యా విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రైనింగ్




**పలాస, నవంబరు 4(వార్త):** వృత్తి నైపుణ్యాలు పెంచుకునేందుకు ఆన్ జాబ్ ట్రైనింగ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఆన్ జాబ్ ట్రైనింగ్ కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్ లు సి హెచ్ శరత్ బాబు, కె.నరసింహ మూర్తి, బి.తేజేశ్వర రావులు తెలిపారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల ఆన్ జాబ్ ట్రైనింగ్ ను స్థానిక మాస్టర్ కంప్యూటర్ సెంటర్ నందు మంగళవారం ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ అవకాశాలు వస్తాయి అని చెప్పారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు టి.వాసుదేవరావు, ఎన్. జయ ప్రకాష్ ఆచారి, ఎం.ప్రసాద్, సుమిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి చైతన్య దీపిక సాయం



**కవిటి, నవంబరు 4(వార్త):** కవిటి మండలం లండారి పుట్టుక పంచాయతీ పొందూరు పుట్టుగా గ్రామానికి చెందిన దూగాన రామ్మూర్తి, దోగాన ప్రణయ్ తండ్రి కొడుకులు ఇటీవల తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. నిరుపేద కుటుంబానికి చెందిన వీరు చికిత్సకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సోంపేట కు చెందిన శ్రీశైన చైతన్య దీపిక స్వచ్ఛంద సంస్థ మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి 8500 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు దేవాడ మోహన్ రావు, ఉపాధ్యక్షుడు బీ న ఆనంద్, దోగాన్ లోకనాథం, కొత్తూరు కాశీపతి, బల్ల జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవాలి

### -మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు

**పలాస, నవంబరు 4(వార్త):** ప్రభుత్వ స్థలాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. భూ అక్రమంలో అడ్డుకోండి, ప్రభుత్వం కాపాడాలి జాతీయ వార్తలో రావడంతో పలాస మున్సిపల్ కమిషనర్ స్పందించి ఆ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. 20 వార్డులో గల 57/1 గల పోరంబోకు స్థలం పరిశీలన చేసి రిపోర్టు పై అధికారులకు తెలియ జేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలపై ఎలాంటి కట్టడాలు చేయకూడదని, ఎంతటి వారైనా కట్టడాలు నిర్మాణం చేపడితే కూల్చి వేయడం జరుగుతుందని హెచ్చరించారు. కమిషనర్ తో పాటు పలాస వైసిపి కౌన్సిలర్ ప్రతినిధి అంబటి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



# కాశీబుగ్గ ఘటన క్షతగాత్రులకు జిల్లా జడ్జి పరామర్శ

**పలాస, నవంబరు 4(వార్త):** కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయాలపాలై పలాస కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంగళవారం శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు శ్రీకాకుళం డివిజన్ సివిల్ సీనియర్ జడ్జ్ కె. హరిబాబు ఆత్మీయంగా పరామర్శించారు. ఆసుపత్రి వార్డుల్లో ప్రతి పడక దగ్గరకు వెళ్లి బాధితులందరినీ పరామర్శించారు. ఘటనలో గాయపడిన వారితో మాట్లాడి గాయపడిన వారందరికీ వైద్యం సరిగా అందుతున్నది లేనిది, మందులు అందుతున్నది లేనిది, అదేవిధంగా వారికి ఆహారము తదితర సౌకర్యాలు పై వారితోనే మాట్లాడి అన్ని సక్రమంగా అందుతున్నవి అని తెలుసుకున్నారు. బాధితులకు నష్టపరిహారం కూడా అందుకున్నారని వారి యొక్క చరవాణిల ద్వారా చూసి నిర్ధారణ చేసుకున్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ యొక్క మెడికల్ ఆఫీసర్ తమ్మినాన పాపినాయుడు, సీనియర్ వైద్యులు డాక్టర్ కూన మోహన్ బాబు, డాక్టర్ రమ్య లతోను మాట్లాడి క్షతగాత్రుల యొక్క ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితుల కాళ్లకు దెబ్బలు తగలడం వలన వాకర్లను పేషెంట్లకు అందజేశారు. చికిత్స విషయంలో ఏదైనా లోటుపాట్లు ఉన్న, ఈ సంఘటన జరిగినప్పుడు గాయపడిన వ్యక్తులకు గాని వారి కుటుంబ సభ్యులకు గానీ ఏమైనా ఫిర్యాదు చేసుకునే అవసరం ఉందా అని ప్రశ్నించగా ఎటువంటి అవసరం లేదని, చికిత్స సంపూర్ణంగా అందుతున్నదని బాధితులు తెలిపారు. “ఆ నలుగురు” అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా బాధితులకు ఆహారం అందజేయబడుతున్నదని పేషెంట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాశీబుగ్గ పోలీస్ ఎస్.ఐ నరసింహమూర్తి, సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్స్ అయి డి. అనంత్ కుమార్, జితేంద్ర, సునీల్, పత్రికా ప్రతినిధులు పాల్గొన్నారు.



## భక్తుల భద్రతపై మార్గదర్శకాలు పాటించండి



**జి.సిగడాం, నవంబరు 4(వార్త):** ఆలయాల్లో భక్తుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆర్డీఓ సాయి ప్రత్యూష పేర్కొన్నారు. ఎందువ గ్రామంలో కైలాసగిరి కొండపై వెలసిన కైలాశేశ్వరక్షేత్రం ఆలయ ప్రాంగణాన్ని ఆమె పరిశీలించారు. తాజాగా కాశీబుగ్గ ఘటన నేపథ్యం దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. కార్తీక మాస పర్వదినాలు, గిరి ప్రదక్షిణ నిర్వహించడంపై భక్తుల రద్దీ నియంత్రణ, భద్రతా చర్యలు అవగాహన కల్పించడంపై స్థానిక దేవాలయ యాజమాన్యం, కమిటీ సభ్యులతో ఆమె నేరుగా మాట్లాడారు. దర్శనానికి నిర్దేశించిన క్యూలైన్లో మాత్రమే వెళ్లాలని దర్శన సమయంలో ప్రాంగణంలో క్రమశిక్షణలతో మెలగాలని సిబ్బందికి సూచించారు. గిరి ప్రదర్శనకు భక్తులు నడిచే 15 కిలోమీటర్లు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. స్థానికలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశము న్నందున నిర్వహాలు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించాలని,భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు స్పష్టంగా గుర్తించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. క్యూలైన్లలో వ్యతిరేక దిశలో ఎవరూ ప్రవేశించకుండా, బారికేడ్లు, రెయిలింగ్లు పటిష్ఠంగా ఉండేలా చూడాలి. రద్దీ సమయాల్లో అదనపు సిబ్బంది, పోలీసు, గార్డులతో రోప్ పార్టీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భద్రతాసిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని అత్యవసర పరిస్థితుల కోసం ఫస్ట్ ఎయిడ్, అంబులెన్స్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. బార్కెట్లు, తాగునీటి సదుపాయ వసతులను పకడ్బందీగా చేయాలని సూచించారు. అత్యవసర మార్గాలు, నిష్క్రమణలను అడ్డుకోవద్దన్నారు. ఏదైనా ఘటన సంభవించిన సందర్భంలో తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆమె వెంట తహాల్దార్ ఎం.సరిత, ఎంపీడీవో జి.రామకృష్ణ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## మృతులకు కొవ్వొత్తులతో నివాళి




**సోంపేట, నవంబరు 4 (వార్త):** సోంపేట పట్టణం వైసీపీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఇటీవల కాశీబుగ్గ తొక్కిసలాటలో మృతులకు నివాళులర్పిస్తూ మంగళవారం సాయంత్రం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మెయిన్ రోడ్డు మీదగా పలువురు కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి మృతులకు భగవంతుడు శాంతి ప్రసాదించాలని కోరారు. పవిత్రమైన ఏకాదశి రోజున భగవంతుడి దర్శనం కోసం వెళ్లి ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన మృతుల పట్ల ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన మృతుల పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు

## ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన.. ప్రజా నాయకుడు జుత్తు



**మందస, నవంబరు 4(వార్త):** మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జుత్తు జగన్నాయకుల 8వ వర్ధంతి పలు చోట్ల ఘనంగా జరిగింది. మందస మండలంలోని భేతాళపురం గ్రామంలోని స్వర్గీయ జగన్నాయకులు, స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకి పూలమాలలు వేసి డా.వై.యస్.ఆర్.ఉద్యాన యూనివర్సిటీ మాజీ బోర్డ్ బత్తిని లక్ష్మణ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఉద్దానం ప్రాంత ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన ప్రజానాయకుడు ఎవరైనా ఉన్నారంటే ఉద్దానం ముద్దు బిడ్డ స్వర్గీయ జుత్తు జగన్నాయకులుగారని ఘంటాపథంగా చెప్పొచ్చన్నారు. ప్రజలిచ్చిన పదవిని నిస్వార్థంగా వాడుకొని ప్రజల గుండెల్లో నిలిచిన గొప్ప మహనీయుడని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీలో ఒక సామాన్య కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి పలాస నియోజకవర్గంలో కీలక సామాజిక వర్గంగా ఉన్న మత్స్యకార అగ్నికుల క్షత్రియ వర్గం నుండి ఒక జాతీయపార్టీ తరపున శాసన సభ్యునిగా ఎన్నికయ్యారంటే ఆయన క్రమశిక్షణ అనేది ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో ఎంతటి ఆదర్శప్రాయమో నేటి నాయకులు గ్రహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి సింహాద్రి, పలాస నియోజకవర్గ వైస్సార్సీపీ యువజన అధ్యక్షుడు దున్న హరిక్రిష్ణ, పలాస నియోజకవర్గ వైస్సార్సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పులారి పితంబరం, వార్డ్ మెంబెర్ సంగారు కృష్ణారావు, విగ్రహ స్థల దాత తాడల అప్పలస్వామి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు తాడాల దామోదర్, మండల సాంస్కృతిక కార్యదర్శి మడియా రుషి, మాజీ సర్పంచ్ గుంటు పార్వతి, కీలు మోహన్ రావు, జుత్తు నారాయణ, తాడాల గణపతి, గుంటు లింగరాజు, జుత్తు పాపారావు, కోడ శ్రీనివాస్, అడతాల సోమయ్య, సంగారు పురుషోత్తం, యువ జన నాయకులు గుంటు కపిల్, సంగారు బాలకృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఐడెంటిటీ కార్డు లు పంపిణీ

**ఇచ్ఛాపురం, నవంబరు 4(వార్త):** పంజా స్ట్రీట్ పాఠశాలలో పేరెంట్-టీచర్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ ఏ 2మార్కుల ప్రోగ్రెస్ రిపోర్ట్ పంపిణీ చేశారు. విద్యార్థుల ఐడెంటిటీ కార్డులు మరియు టైలు పంపిణీ కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులకు ఐడెంటిటీ కార్డ్స్ లను 17 వ వార్డు ఇన్ చార్జ్ జెన్నెల సంతోష్, వారి మిత్రుల సహకారంతో పంపిణీ చేశారు. టై లను 5వ తరగతి విద్యార్థి సందీప్ తన పాకెట్ మనీ తో వితరణ చేశారు.అత్యధిక మార్క్స్ సాధించిన వారికి బహుమతులు అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎం ఈ ఓ అప్పారావు హాజరై విద్యార్థులను ప్రోత్సహిస్తూ, తల్లిదండ్రులతో సంభాషించారు.ఈ కార్యక్రమంలో చైర్మెన్ దొరబాబు,వైస్ చైర్మన్ వరలక్ష్మి, కో అప్టెడ్ సభ్యులు కాళ్ల శ్రీనివాసరావు హాజరై అత్యధిక మార్క్స్ సాధించినవారికి కాళ్ల శ్రీనివాసరావు విద్యార్థులకు బహుమతులను, పేరెంట్‌కి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమం విద్యార్థులు నాటికలు, ఆటలు , ప్రసంగాలతో విజయవంతంగా జరిగింది. పాఠశాల హెచ్.ఎమ్. జి. భాస్కరరావు, ఉపాధ్యాయులు ఆదినారాయణ, రాణి, దుర్గ, శైలజ, సౌజన్య , సుశీల, నాగమణి, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉన్నత సౌకర్యాలతో అత్యున్నత విద్య

### -ఎమ్మెల్యే అశోక్, మాజీ ఎమ్మెల్యే శివాజీ - ఘనంగా మహర్షి భవనాల ప్రారంభం



**సోంపేట, నవంబరు 4(వార్త):** ఉన్నతమైన సౌకర్యాలతో అత్యున్నతమైన విద్యను అందించేందుకు అంకితభావంతో పనిచేస్తున్న మహర్షి విద్యాలయం యాజమాన్యాన్ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యే గౌడ్ శ్యామసుందర శివాజీ అభినందించారు. సోంపేటలో సుదీర్ఘ చరిత్ర గల మహర్షి విద్యాలయం అధునాతన భవనాలను మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో దశాబ్దాలుగా ఉత్తమమైన విద్యను అందిస్తూ సోంపేటలో ప్రముఖ విద్యాసంస్థగా గుర్తింపు పొందిన మహర్షి విద్యాలయం మరెన్నో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యపై శ్రద్ధ చూపి, ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించి, సమయాన్ని వృథా చేయ కుండా చదువు కోసం వెచ్చించడం వంటి కార్యక్రమాలతో విద్యార్థులు ఉన్నతమైన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సమాజంలో ప్రస్తుత సాంకేతిక యుగంలో సరికొత్త మార్పులకు అనుగుణంగా విద్యాభ్యాసాన్ని వృద్ధిపరుచుకోవాలని కోరారు. మంచి ఇంజనీర్లుగా, వైద్యులుగా, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. అంతకుముందు ముఖ్య అతిథులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అదరగొట్టారు. డాక్టర్ అశోక్, గౌతు శివాజీ లను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ లు జోరాడు, కృష్ణంరాజు, పాఠశాల యాజమాన్యం జివిఎస్-ఎస్ ప్రసాద్, ఏపీ మురళి, ఎల్ శకుంతల, ఏపీ రోజా రాణి, స్థానిక కోదండరామ ఆలయ చైర్మన్ బీన ఆనంద్, కూటమి నేతలు చిత్రాడ శేఖర్, బిన ఈశ్వరరావు, రెల్ల నారాయణ,చిత్రాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చెకుముకి పరీక్షలో కొత్తపల్లి విద్యార్థుల సత్తా

**మందస, నవంబరు 4(వార్త):** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ చెకుముకి సంబరాలు-2025 కార్యక్రమంలో భాగంగా మందస మండలంలోని హరిపురం ఉన్నత పాఠశాల కేంద్రంగా జరిగిన మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్షలలో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు తెలిపారు. కొత్తపల్లి ఉన్నత పాఠశాల నుండి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులలో 10వ తరగతి నుండి నెయ్యల భార్గవి, 9వ తరగతి నుండి శిష్ము. శశాంక్, 8వ తరగతి నుండి ఉగ్రిపల్లి అస్మితలు ఉన్నారన్నారు. కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ మధ్యకాలంలో హాజరైన అన్ని ప్రతిభా పరీక్షలు, క్విజ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తూ, ఆయా విద్యార్థులను వారికి సహకరిస్తున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జి.భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి.సూర్యనారాయణ, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, ఎస్.హారిక తదితరులు ఉన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## హిందీ స్టడీ మెటీరియల్ పంపిణీ

**ఇచ్ఛాపురం, నవంబరు 4(వార్త):** కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నరేంద్ర నాథ్ పట్నాయక్ తయారు చేసిన 10వ తరగతి హిందీ మెటీరియల్ పంపిణీ చేశారు. 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం హిందీ మెటీరియల్ ను తయారు చేసి ఉచితంగా అందరూ విద్యార్థులకు ఇస్తున్నట్లు, ఈ సంవత్సరం 2025 2026 కు గాను మెటీరియల్ ను కొలిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు నరేంద్ర నాథ్ పట్నాయక్ తయారు చేసి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల కుమారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ రావు, ధర్మరాజు, ఉప్పాడ పాపారావు, కోటేశ్వర రావు పాల్గొన్నారు.

# బీచ్‌ల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టండి

### - విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి

**శ్రీకాకుళం, నవంబరు 4(వార్త):** పవిత్ర కార్తీక పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు బీచ్‌లకు భక్తులు, సందర్శకులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలేఅఉ తీసుకోవాలని కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ ఇన్‌చార్జి, విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో వారితో మాట్లాడారు. మెరైన్ పోలీస్ అధికారులందరూ, సిబ్బందితో రేపు తెల్లవారుజామున 3 గంటల నుంచి బీచ్‌ల్లో విధులు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని రకాల ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని, భక్తులకు, సందర్శకులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా తగిన అన్ని చర్యలు తీసుకోవాలని, పోలీసు, రెవెన్యూ, మత్స్యకార, వైద్య ఆరోగ్య శాఖ, స్థానిక మత్స్యకారులు, స్వచ్ఛంద సంస్థలు మొదలైన వారితో సమన్వయం చేసుకొని భక్తులు, సందర్శకులందరికీ ఎలాంటి అసౌకర్యం, ప్రమాదం కలగకుండా అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పవిత్ర కార్తీక మాసం సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే సందర్శకులకు పలు సూచనలు చేశారు.

1. సందర్శకులు పోలీసు వారి సూచనలను తప్పకుండా పాటించి, ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలి.

2. పోలీసులు విధుల్లో ఉన్న ప్రదేశంలో, వారి సూచనలను అనుసరించి మాత్రమే సముద్ర స్నానాలకు దిగాలిబీ ఎక్కువ దూరం లోపలకు పోకుండా, అలలకు ఎదురు పోకుండా జాగ్రత వహించాలి.

3. ఇటీవల వచ్చిన తుఫాను ప్రభావం వల్ల సముద్రంలో కొన్ని చోట్ల గుంతలు ఏర్పడి దిగబడే అవకాశం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే సముద్రం బయటకు ప్రశాంతంగా ఉన్నట్లు కన్పిస్తుంది. కానీ లోపల చాలా ప్రమాదకర గుంతలు, సుడిగుండాలు ఉండవచ్చు. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

4. చిన్న పిల్లలను అన్ని సమయంలో మీ దగ్గర ఉంచుకొని మాత్రమే స్నానాలు చేయించాలి. ఒడ్డుకు తీసుకొచ్చే వరకు జాగ్రత్తగా చూసుకోవాలి.

5. స్నానాల సమయంలో మీ విలువైన వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలి.

6. సముద్ర తీర ప్రాంతంలో మద్యం సేవించడం, గందరగోళం సృష్టించడం లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలు చేయకూడదు.

7. ఎవరైనా ప్రమాదంలో పడ్డారు అనిపిస్తే వెంటనే సమీపంలో ఉన్న మెరైన్ పోలీస్ సిబ్బంది లేదా లైఫ్ గార్డులకు తెలియజేయాలి.

8. సముద్ర అలలు ఎక్కువగా ఉన్నప్పుడు లేదా వాతావరణం ప్రతికూలంగా ఉన్నప్పుడు స్నానాలకు దిగకూడదు.

9. బీచ్ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు మరియు పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ సూచనలు తప్పకుండా పాటించాలి.

10. వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు సముద్రంలో లోతుగా దిగకూడదు.

11. ఏదైనా అనుమానాస్పద వస్తువు, వ్యక్తి లేదా పరిణామం గమనించిన, వెంటనే మెరైన్ పోలీస్ కంట్రోల్ రూమ్ 1093 కు సమాచారం ఇవ్వాలి.

12. మీ వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలిపి ఉంచాలి.

13. ఫొటో లేదా వీడియో తీసేటప్పుడు సముద్రానికి అత్యంత దగ్గరగా వెళ్లకుండా జాగ్రత్త పడాలి.

14. సముద్ర స్నానానికి వెళ్ళే ముందు మీ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అనారోగ్యంగా ఉంటే స్నానానికి దిగరాదు.

15. వర్షాకాలం లేదా తుఫాను హెచ్చరికలు ఉన్నపుడు వెంటనే బీచ్ ఖాళీ చేయాలి.

16. సముద్ర తీరానికి వచ్చే సందర్శకులు ఎప్పుడూ తమ కుటుంబ సభ్యులు/స్నేహితులతో సమూహంగా కలిసి ఉండాలిబీ దూరంగా ఉండకూడదు.

17. భద్రత కోసం మెరైన్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు లేదా హెచ్చరిక రోపులను దాటి వెళ్లకూడదు.

18. బీచ్ వద్ద తప్పిపోయిన వ్యక్తులు లేదా పిల్లలు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయండి.




19. బీచ్ వద్ద అతి శబ్దకరమైన స్పీకర్లు, డీజే మొదలైనవి వినియోగించకూడదు.

20. సాయంత్రం 6 గంటల తర్వాత సముద్ర స్నానాలకు దిగకూడదు.

21. సముద్రంలో ఈత కొట్టడం, బోట్లు లేదా ట్యూబులు వినియోగించడం ప్రమాదకరం.

22. ఏదైనా గాయపడిన వ్యక్తి లేదా అత్యవసర పరిస్థితి అయితే వెంటనే 100 లేదా మెరైన్ పోలీస్ హెల్ప్‌లైన్ 1093కు కాల్ చేయండి.

## తప్పని తాగునీటి ఇక్కట్లు



**నరసన్నపేట, నవంబరు 4(వార్త):** నరసన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం వద్ద పైపులైన్లు లీక్ కావడంతో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో సమాచారం అందుకున్న పంచాయతీ అధికారులు మంగళవారం హుటాహుటిన పైపులు మరమ్మతులు చేస్తున్నారు. రెండు రోజులు ఇబ్బందులు తప్పవని వినియోగదారులు సహకరించాలన్నారు.

## పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానిత మహిళలు





**జి.సిగడాం, నవంబరు 4(వార్త):** జి.సిగడాంలో మంగళవారం సాయంత్రం అనుమానిత మహిళలు సంచరించటంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. గుర్తు తెలియని మహిళలు అనుమానంగా గ్రామంలో చొరబడటంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. స్థానికులు చెప్పిన వివరాలు ప్రకారం స్థానిక సత్యసాయి విద్యామందిర్ సమీపంలో, వెనుకన ఐదుగురు అనుమానిత మహిళలు సంచరించడంతో ప్రిన్సిపాల్ ప్రసాద్ వారిని ప్రశ్నించగా పరుగులు తీశారని, గ్రామస్తుల సహకారంతో వెంబడించగా అందులో ఇద్దరు మహిళలు పరారవ్వగా, ముగ్గురుని పట్టుకుని పోలీసులకు అప్పగించామన్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ అడుగగా ఆ మహిళలను అదుపులోకి తీసుకున్నామన్నారు.

## చెకుముకి పరీక్షలకు 126 మంది హాజరు



**నరసన్నపేట, నవంబరు 4(వార్త):** నరసన్నపేట పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సాయి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జరిగిన ఈ పరీక్షలో భాగంగా మండలం నుంచి 42 టీములు వచ్చాయన్నారు. 126 మంది పరీక్షలలో పాల్గొనగా ఎంపికైన విద్యార్థులు ఈ నెల 23వ తేదీన శ్రీకాకుళంలో జరిగే జిల్లాస్థాయి పోటీలకు వెళ్తారన్నారు.

## తహశీల్దార్ కార్యాలయానికి స్థల పరిశీలన



**సారవకోట, నవంబరు 4(వార్త):** సారవకోట తహశీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవటంతో కొత్త నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రూ. 1.70 కోట్లు నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో భవన నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటితే 'హరిత మందస' సాధ్యం

**మందస, నవంబరు 4(వార్త):** ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పలువురు నాయకులు అన్నారు. మందస పట్టణంలో గో గ్రీన్ మందస ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పోలీస్ క్వార్టర్స్ నుండి కొత్తవీధి వరకు మొక్కలు నాటి కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకుడు, గో గ్రీన్ సభ్యుడు గిన్ని తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన పర్యావరణాన్ని కాపాడడమే కాకుండా మెయిన్ రోడ్డును పచ్చదనంతో తీర్చిదిద్దడం అవుతుందన్నారు. గో గ్రీన్ ప్రతినిధి, మందస సర్పంచ్ ప్రతినిధి సీహెచ్ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం గో గ్రీన్ సభ్యుడు, జనసేన జిల్లా నాయకుడు దిలీప్ పాణిగ్రాహి మాట్లాడుతూ డివైడర్ ఎదురుగా ఉన్న ప్రజలు మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని, దీంతో పర్యావరణానికి మరింత మేలు జరుగుతుందన్నారు. నీల్-మోహన్ రిసోర్స్ ఫౌండేషన్ డైరెక్టర్ పట్నాల మోహనరావుచారి ఆర్థిక, హార్దిక సహకారంతో నిర్వహించబడిన కార్యక్రమంలో మామిడి కోదండరావు, శ్రీనివాస్ పాడి, బైరాగి మాస్టారు, పూనా ఈశ్వరరావు, వల్లభరావు, క్రిష్ణారావు బాలరాజు, కిమ్మోజీ, మోహనరావు, దున్న హరికృష్ణ పాల్గొన్నారు.





## ఒరిస్సా గవర్నర్‌కు వేద ఆశీర్వచనాలు


**ఇచ్ఛాపురం, నవంబరు 4(వార్త):** ఒడిశా పర్యటనలో భాగంగా బాలబ్రహ్మానంద సరస్వతీ (వారాహి నైమిషారణ్య పీఠాధిపతి) ఆ రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు ఆహ్వానం మేరకు ఒరిస్సా రాజ్‌భవన్, భువనేశ్వర్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. హరిబాబుకు వేద ఆశీర్వచనం చేసి వారాహి పీఠం అమ్మవారి చిత్రపటం సమర్పించారు. ఒరిస్సా ధార్మిక పర్యటన గూర్చి చర్చించారు, అనంతరం ఒరిస్సా రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా హెూమాలు చేయాలని కోరారని బాలబ్రహ్మానంద సరస్వతీ తెలిపారు.

## యాదవ నేతలకు వైసీపీ సన్మానం



**కంచిలి, నవంబరు 4(వార్త):** యాదవ సామాజిక వర్గం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గం యాదవ సామాజిక వర్గ అధ్యక్షునిగా ఎన్నికైన మడ్డు వెంకటరావును కంచిలి మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం సాలినిపుట్టుగా గ్రామంలో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ పైలదేవదాసు రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొని కొత్తగా పదవులు పొందిన యాదవ జాతి నాయకులను అభినందించారు. జిల్లాలో అధిక జనాభా కలిగిన యాదవ సామాజిక వర్గం అభివృద్ధికి సంక్షేమానికి జాతి నాయకులుగా మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు వజ్జ మృత్యుంజయం, దుర్గాసి ధర్మారావు, గుమ్మడి రాందాసు, తెలుసూరి అప్పారావు, యాదవ కుల పెద్దలు పాల్గొన్నారు.

## అపరిచిత వ్యక్తుల సమాచారమివ్వండి



**నరసన్నపేట, నవంబరు 4(వార్త):** గ్రామాలలో అపరిచిత వ్యక్తులు తారసపడిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని నరసన్నపేట సీఐ ఎం శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం నరసన్నపేట సీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చలికాలం, పండగ సమయాలలో ఇతర రాష్ట్రాల నుంచి తెలుగు భాష రాని వారు రగ్గులు, బట్టలు అమ్మేందుకు తిరుగుతూ ఉంటారన్నారు. ఆ సమయంలోనే వారు పలు ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

గ్రామాలలో అప్రమత్తంగా ఉంటూ ఇతర రాష్ట్రా లకు చెందిన వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని ట్రైనీ ఎస్సై ప్రమీలాదేవి ఆదేశించారు. మంగళవారం నరసన్నపేట పోలీస్ స్టేషన్లో మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ. పండగలలో మనకు గుర్తు తెలియని వారు కూడా గ్రామాలలో సంచరిస్తూ ఉంటారని వివరించారు. వీరిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.



## ప్రభుత్వం మెడలు వంచేందుకే కోటి సంతకాలు

### -చంద్రబాబూ హామీలన్నీ ఏమయ్యాయి -మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




**ఎల్ఎన్ పేట, నవంబరు 4(వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మంగళవారం మండలంలో యంబరాం పంచాయితీలో రాష్ట్ర వైకాపా క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో నిర్వహించి న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన కనబడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ప్రజలకు ఇష్టానుసారంగా హామీలను ఇచ్చి పదవిలోకి వచ్చాక వాటిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం పరిపాలనను పక్కన పెట్టి దాచుకోవడం, దోచుకోవడానికే ఎక్కువ సమయం కేటాయిస్తోందని దుయ్యపడ్డారు. అలాగే చంద్రబాబు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కపథకం సక్రమంగా అమలు చేశారా అని విమర్శించారు. ఎక్కువగా ఇసుక, ల్యాండ్, లిక్కర్ వ్యాపారాల కోసం అధిక సమయం కేటాయిస్తున్నారని ఆరోపించారు. అలాగే జగనన్న ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయం రంగాలపై పెద్దపీట వేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం సమకూర్చేలా ఘనత ఒక్క జగనన్నకే దక్కిందన్నారు. రాష్ట్రంలో 15 వైద్య కళాశాలలు-తీసుకువచ్చిన ఘనత జగనన్నదేనని ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక ఫ్లాప్ షోగా మిగిలిపోయిందన్నారు. 50 ఏళ్లకే పింఛన్ ఎక్కడుందని, మహిళలకు ప్రకటించిన రూ.1500లు ఎప్పుడిస్తారని అంటూ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి జ్యోతిలక్ష్మి, రామారావు, మండల అధ్యక్షులు పెనుమజ్జి విష్ణు, సర్పంచ్‌లు తొత్తడి మురళీకృష్ణ, ఈగల చిన్నారావు, ముద్దాడ లక్ష్మణరావు, జి.యోగేశ్వరరావు, ఎం.దివాకర్, బలగ గోవిందరావు, పెనుమజ్జి రామారావు, పెనుమజ్జి లక్ష్మణరావు, కిలారి శంకరరావు. పెనుమజ్జి రామచంద్రుడు, రుంకు శ్రీనువాసరావు పాల్గొన్నారు.



## సత్యసాయి విద్యా విహార్‌లో వ్యక్తిత్వ వికాసం



**పలాస, నవంబరు 4(వార్త):** శ్రీ సత్యసాయి విద్యాజ్యోతి ఇంచార్జ్ శ్రీ జనార్దనరావు, శ్రీ సత్యసాయి బాబావారి శతవర్ష జయంతి వేడుకలలో బాగంగా ఇదివరలో జిల్లాపరిధిలో 99 పాఠశాలలో గ్రోమింగ్ ఫర్ ఎక్సలెన్స్ కార్యక్రమము నిర్వహించారు. మంగళవారం 100వ కార్యక్రమం శ్రీ సత్యసాయి విద్యావిహార్ రామక్రిష్ణపురములో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10వ మరియు 9వ తరగతి విద్యార్థిని విద్యార్థులు పాల్గొని మంచి జ్ఞానం పొందినారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులు గా ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు వ్యవహరించారు.

శ్రీ సత్యసాయి సేవాసంస్థలు శ్రీకాకుళం జిల్లా ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ సకలాభక్తుల అనాదిగుప్తా ముఖ్య అతిథిగా పాల్గొనగా పొందూరు నానాజీ, శ్రీ సత్యసాయి సేవాసమితి పూండి క్రియాశీల సభ్యులు విజయలక్ష్మి, నూకరాజు దంపతులు, జిల్లా సనాతనసారధి ఇంచార్జీ నాగేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాలాసు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, ఉపాధ్యాయులు మురళీ, అనుదీప్, వివేకానంద, గోపాల్ కృష్ణ, ఋషికేశ పాల్గొన్నారు.

# మండల స్థాయి సైన్సు చెకుముకి పోటీలు



**ఇచ్ఛాపురం, నవంబరు 4(వార్త):** ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీల్లో మండల విద్యాశాఖ అధికారులు అప్పారావు, విశ్వనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యం, పాఠశాల సెక్రెటరీ కామరాజు, మండలంలో గల బయాలజికల్ సైన్స్ మరియు ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ స్థానం లో మున్సిపల్ గర్ల్స్ హై స్కూల్, ద్వితీయ స్థానం లో ఏపీ మోడల్ స్కూలు-పురుషోత్తపురం, తృతీయ స్థానంలోప్రభుత్వ ఉన్నత పాఠశాల-ఇచ్ఛాపురం నిలిచాయి. విజేతలను మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారు అందరూ అభినందనలు తెలియజేశారు.

## రుణాలను వినియోగించుకుని ఆదాయ వనరులు పెంచుకోవాలి



**మందస, నవంబరు 4(వార్త):** ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా మహిళా సంఘ సభ్యులు అందరి ఆమోదంతో తీసుకున్న రుణాలను, సక్రమముగా ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకొని, ప్రతి గ్రామంలో మహిళలు ఎంటర్ప్రైనర్లుగా తయారు కావాలని వెలుగు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస మండలంలోని కుసుమల, దేవుపురం గ్రామ సంఘం మహిళలు సమావేశాలు జరిపించుకుని, ప్రస్తుతం ప్రభుత్వము మహిళాభివృద్ధికి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఉద్దేశానికి అనుగుణంగా గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పాత లోన్లు చెల్లించిన వారందరికీ మైక్రో క్రెడిట్ ప్లాన్ ఆధారంగా సి.ఐ.ఎఫ్., ఉన్నతి, శ్రీనిధి, బ్యాంకు ద్వారా కొత్త రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుసుమల అధ్యక్షురాలు ఎస్.పద్మావతి, దేవుపురం అధ్యక్షురాలు జి.భారతి, వీవోఏలు జగబంధు, ఆనంద్, పుష్ప, క్లస్టర్ కోఆర్డినేటర్ స్వామినాయుడు పాల్గొన్నారు.

## ముగిసిన చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు



**జలుమూరు, నవంబరు 4(వార్త):** జలుమూరు మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు విజయవంతంగా ముగిశాయని ఎంఈఓ బమ్మిడి మాధవరావు తెలిపారు. మంగళవారం జరిగిన ఈ పరీక్షలలో 69 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల నుంచి 18 టీంలు, ప్రైవేట్ పాఠశాలల నుంచి నాలుగు టీములు పాల్గొన్నాయన్నారు. ప్రథమ బహుమతి ఎలమంచిలి విద్యార్థి సాధించాడని పేర్కొన్నారు.

## ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్

- జిల్లా వ్యాప్తంగా హై స్కూల్స్ లో బాలికలకి శిక్షణ
- ప్రారంభించిన సమగ్ర శిక్షా ఏపిసి శశిభూషణరావు



**శ్రీకాకుళం, నవంబరు 4(వార్త):** ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ ప్రతి ఒక్కరు నేర్చుకోవాల్సిన అవసరం నేటి సమాజంలో ఎంతైనా ఉందని జిల్లా సమగ్ర శిక్షా ఏపిసి డా.ఎస్. శశిభూషణరావు అన్నారు. బాలికలు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం ద్వారా అనుకోని ఆపదలు ఎదురైనప్పుడు వాటి నుంచి స్వీయ రక్షణ పొందవచ్చునన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం రాణి లక్ష్మి బాయి ఆత్మరక్ష- స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన నిర్వాహక ప్రతినిధులైన రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి వ్యవస్థాపకురాలు ఎన్ .లక్ష్మీ సామ్రాజ్యం,డైరెక్టర్ డా.వి.రవి,ఏపిటిఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు,జిల్లా కో-ఆర్డినేటర్ తైక్వాండో శ్రీనులతో కలసి ప్రారంభించారు. తైక్వాండో కోచ్ లు విద్యార్థినులకి ఆత్మరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల కోసం వారి సమక్షంలో వివరించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్షా ఏపిసి శశిభూషణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లోని బాలికలకి ఆత్మరక్షణ కోసం శిక్షణను ఇచ్చేందుకు రాణి లక్ష్మి బాయి-ఆత్మ రక్ష-స్వీయ రక్షణ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా 382 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని బాలికలకు ఆత్మరక్షణ విద్యలో శిక్షణను ఇవ్వనున్నట్లుగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని బాలికలకు సద్వినియోగం చేసుకుని ఆత్మ రక్షణ విద్యను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి వ్యవస్థాపకురాలు ఎన్ .లక్ష్మీ సామ్రాజ్యం మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకి ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇచ్చే అవకాశం తమ సంస్థకి దక్కిందన్నారు. జిల్లాలోని స్కూళ్ళలో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన కోచ్ లను నియమించి వారి ద్వారా శిక్షణను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీకాకుళం జిల్లాకి కో-ఆర్డినేటర్ గా ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడుగా ఉన్న తైక్వాండో శ్రీను వ్యవహరిస్తారని ఆయన సారధ్యంలోనే ఈ శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.సుజాత, పిడి, పిఇటిలు డి.భవానీ, అరుణ, శాప్ కోచ్ లు లక్ష్మణ్, మణి, తైక్వాండో కోచ్‌లు నర్సిపట్నం శేఖర్, మజ్జి గౌతమ్, నవీన్, రాహుల్, నాగమ్మ, హరి, ఖాన్, డాంగ్లీ తదితరులు పాల్గొన్నారు.




# పిఎంజె బాబు సేవలు సమాజానికి అవసరం

- భవిష్యత్ లో ఉన్నత పదవులను అధిరోహించాలి
- అందరివాడుగా గుర్తింపు పొందిన సిసలైన అంబేద్కర్ వాది బాబు
- ఎమ్మెల్యే గొండు శంకర్
- దళిత -ఆదివాసీ-బహుజన-మైనార్టీ జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం



**పలాస, నవంబరు 4(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా సంక్షేమ ,మౌలిక వసతుల అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ గా నియమితులైన పిఎంజె బాబు సేవలు సమాజానికి అవసరమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అందరివాడుగా గుర్తింపు పొందిన అసలు సిసలైన అంబేద్కర్ వాది బాబు అన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత పనిచేసే వ్యక్తి పిఎంజె బాబు అని కొనియాడారు. తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించి నారా లోకేష్ నేతృత్వం వహిస్తున్న విద్యాశాఖకు అనుబంధంగా ఉండే కార్పోరేషన్ లో ఆయనను డైరెక్టర్ గా ప్రభుత్వం నియమించడం జరిగిందన్నారు. భవిష్యత్ లో పిఎంజె బాబు ఉన్నత పదవులను అధిరోహించాలని కోరుకుంటున్నానన్నారు. అందుకోసం తన వంతు సహాయ సహకారాలను ఆయనకి అందిస్తానన్నారు. దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల జెఏసి ఆద్వర్యంలో తైక్వాండో శ్రీను,డా.కంఠ వేణుల సారధ్యంలో టౌన్ హాల్ రోడ్డులోని శ్రీ ఫంక్షన్ హాల్ వేదికగా మంగళవారం నిర్వహించిన రాష్ట్ర విద్యా సంక్షేమ ,మౌలిక వసతుల అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ పిఎంజె బాబు చిరుసత్కార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఆర్డిఓ స్థాయిలో పనిచేసిన పిఎంజె బాబు ఏ నాయుడు తానొక రిటైర్డ్ అధికారినని ఏ నాడు దర్పం ప్రదర్శించకుండా పార్టీలో అందరితో కలసి పనిచేసారన్నారు. తెలుగుదేశం పార్టీ ఆయనకి ఏ బాధ్యతలను అప్పగించినా దాన్ని చిత్తశుద్ధితో స్వీకరించి పూర్తి చేసేవారన్నారు. అటువంటి వ్యక్తికి డైరెక్టర్ పదవి రావడం ఆనందంగా ఉందన్నారు. టిడిపిలో కష్టపడి పనిచేసే వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందన్నారు. పిఎంజె బాబు లాంటి నిబద్ధతతో పనిచేసే వారి సేవలు అటు పార్టీకి ఇటు సమాజానికి కూడా ఎంతో అవసరం అని ఎమ్మెల్యే శంకర్ పునరుద్ఘాటించారు. జనసేన పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సుదీర్ఘ కాలం వివిధ హొదాలలో రెవెన్యూ అధికారిగా పనిచేసిన పిఎంజె బాబుకి రాష్ట్ర విద్యా సంక్షేమ ,మౌలిక వసతుల అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ గా అవకాశం రావడం ఆనందం ఉందన్నారు. ఆయనకి ఎస్.సి కమిషన్ సభ్యుడుగానో లేదా అంతకంటే పెద్ద పోస్టు ఏదైనా వచ్చి ఉంటే ఇంకా సంతోషించే వారిమన్నారు. భవిష్యత్ లో పిఎంజె బాబుకి ఉన్నత పదవి లభించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏపిఎన్ జిజిఓస్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, అంబేద్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ యశోదలక్ష్మీ, శ్రీకాకుళం తహసీల్దార్ శిర్ల గణపతి, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి రామ్ గోపాల్ ,ఎస్.సి ఉద్యోగుల సంఘం నాయకుడు రాయి వేణుగోపాల్ , రచయిత స్వామి వివేకానంద జాతీయ అవార్డు గ్రహీత గురుగుబెల్లి లోకనాథం , తెలుగుదేశం పార్టీ నాయకులు సింతు సుధాకర్ ,మాదారపు వెంకటేష్ ,పాండ్రంకి శంకర్ ,కోరాడ హరగోపాల్ ,ఎస్.వి.రమణ మాదిగ ,మైనార్టీ సంఘం నాయకులు మహిబుల్లా ఖాన్ ,పార్వతీపురం మన్యం జిల్లా దళిత నాయకుడు బత్తిన మోహన్ రావు, బొడ్డేపల్లి భూపతిరావు తదితరులు మాట్లాడుతూ పిఎంజె బాబు రెవెన్యూ శాఖ అధికారిగా ,తెలుగుదేశం పార్టీ నాయకుడుగా అందించిన సేవలను కొనియాడారు. నిరాడంబరతకి మారుపేరుగా నిలిచి ప్రజలకు సేవ చేయడంలో పిఎంజె బాబు ఎల్లప్పుడు ముందు ఉండే వారని ప్రశంసించారు. అటువంటి నిబద్ధత కలిగిన నాయకుడుగా రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులు కావడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేసారు. భవిష్యత్ లో పిఎంజె బాబు ప్రజలకు సేవ చేసే ఉన్నత పదవిని అధిరోహించాలని వారంతా ఆకాంక్షించారు.

### చిత్తశుద్ధితో పనిచేస్తా

రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా చిత్తశుద్ధితో పనిచేస్తానని పిఎంజె బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ,తెలుగుదేశం పార్టీ తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానన్నారు. అటు పార్టీకి ఇటు ప్రజలకి కూడా తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ సేవలను అందిస్తానన్నారు. తనపై ఆదరాభిమానాలను చూపిస్తున్న అందరికి కూడా పిఎంజె బాబు కృతజ్ఞతలను తెలియజేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ , జిల్లాకి చెందిన కేంద్ర ,రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు ,అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### పిఎంజె బాబుకి ఘన సత్కారం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా సంక్షేమ ,మౌలిక వసతుల అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ గా నియమితులైన పిఎంజె బాబును ఘనంగా సత్కరించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తొలుత బాబును దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేసారు. అనంతరం దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల నేతలు వరుసగా పిఎంజె బాబును సత్కరించారు. జై భీమ్ ,జై బాబు నినాదాలు చేస్తూ పిఎంజె బాబు అభిమానులు సందడి చేసారు.



### ఎమ్మెల్యే శంకర్‌కి ఆత్మీయ సత్కారం

తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేస్తున్న పిఎంజె బాబుకి రాష్ట్ర విద్యా సంక్షేమ ,మౌలిక వసతుల అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ గా అవకాశం దక్కేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే గొండు శంకర్ కి దళిత-ఆదివాసి-బహుజన-మైనార్టీ సంఘాల నేతలు అంతా కలసి ఆత్మీయ సత్కారం చేసారు. దళితులకి ,ఆదివాసిలకి, బహుజనులకి, మైనార్టీలకు అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే చొరవ తీసుకోవడాన్ని వారంతా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంధవరపు ప్రసాద్, ప్రధాన విజయరాం, కవ్వాడి సుశీల, దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ జేఏసీ నాయకులు గద్దిబోయిన కృష్ణారావు, వైశ్యరాజు మోహన్, సైలానీ, పొన్నాడ రవికుమార్, ఎల్.నాగరాజు, విజయ్, కెల్ల గిరికుమార్, కె.రమణమ్మ, పద్మావతి తోపాటు దళిత సంఘ నాయకులు సాకేటి నాగరాజు, దేబారికి రామప్పుడు, లింగాల గరికవాడు, బడియా కామరాజు, గురుగుబెల్లి రవి, బొత్స బుద్ధుడు, అర్జి కోటి, అర్జి ఈశ్వరరావు, బోసి మన్మధరావు, క్రిష్ణారావు, శీర రాజేశ్వరి, నేతల అప్పారావు, తెప్ప పాండురంగారావు, కొత్తూరు సత్యన్నారాయణ, పెయ్యిల చంటి, అబ్బాస్, విజయ్, రాహుల్, దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ జేఏసీ నాయకులతోపాటు తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అయ్యో.. భౌబోయ్..!

-ప్రజలను వేధిస్తున్న గ్రామ సింహాలు -తెగబడి దాడి చేస్తున్న వైనం -కాపాడాలని కమిషనర్‌కి విన్నపం



**పలాస, నవంబరు 4(వార్త):** గ్రామ సింహాలు బెడద నుంచి ప్రజలను టిడిపి 18 వ వార్డు ఇంచార్జ్ హనుమంతు మురళీమోహన్ దొర విజ్ఞప్తి చేశారు. కుక్కల బెడద నుండి కాపాడాలని స్థానిక ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్,కమీషనర్ కి పలాస ప్రజల తరపున తెలుగుదేశం నాయకులు హనుమంతు మురళీమోహన్ కోరారు. పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కలు భీభత్సము సృష్టిస్తున్నా, వీధిలోకి వెళ్లాలంటేనే భయమేస్తుందని, విద్యార్థులు పాఠశాలకు వెళ్లి రావాలంటే ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందవలసి వస్తుందని తెలిపారు. ద్విచక్ర వాహదారుల వెంటపడి కుక్కలు తరుమూతుంటే ఏమౌతుందో తెలియడం లేదని భయపడుతున్నారు. రాత్రుల్లో విధులకు విలువలు వస్తే వెళ్లి వచ్చే వారి పరిస్థితి గురుంచి వేరే చెప్పవలసిన అవసరం లేదని అన్నారు. మహిళలు వీధిలోకి వచ్చిన కూరగాయలు,ఆకుకూరలు, చేపలు మొదలగు నిత్యావసర వస్తువులు కొనుక్కోవాలి అంటేనే భయపడిపోతున్నారు. ఈ కుక్కల సమస్య మొదటి ప్రాధాన్యతగా పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని తెలుగుదేశం నాయకులు హనుమంతు మురళీమోహన్, వీరఘట్టపు వెంకటరావు (వెటర్నరీ డాక్టర్ ), బీజేపీ నాయకులు లక్కోజు ధర్మారావు, మూల కామేశ్వరరావు (డాక్టర్ ),హనుమంతు అనీల్ కుమార్ ( మెడికల్ రిప్రెజెంటేటివ్ )కుక్కల బారిన పడకుండా పట్టణ ప్రజల ప్రాణాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

## మంత్రి లోకేష్ పెత్తనం తగ్గించాలి

-రాష్ట్రంలో పోలీసు వ్యవస్థకు స్వేచ్ఛ లేదు
-బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్
- కాశీబుగ్గ దుర్ఘటన బాధితులకు పరామర్శ

**పలాస, నవంబరు 4(వార్త):** మంత్రి నారా లోకేష్ పెత్తనం తగ్గించాలని, రాష్ట్రంలో పోలీసుల వ్యవస్థకు స్వేచ్ఛ లేదని, లా అండ్ ఆర్డర్ పై పెత్తనం తగ్గించాలని బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ అన్నారు. కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయ తొక్కిసలాటలో గాయపడిన, మరణించిన బాధ్యతులకు పరామర్శించారు. బోడె రామచంద్ర యాదవ్ క్షతగాత్రులకు మనోధైర్యం కల్పించి, వారి కుటుంబలకు పార్టీ తరుపున సహాయం అందజేశారు. మృతుల కుటుంబ సభ్యలకు బీసీవై పార్టీ తోడుగా ఉంటుంది అని ధైర్యని వెల్లడించారు. మరణించిన తొమ్మిది మంది ఆత్మలకు సద్గతులు కలగాలని, గాయపడిన వారు తొందరిగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నారా లోకేష్ పెత్తనం తగ్గించాలని, పోలీస్ వ్యవస్థకు సంబంధించి ఇంటెలిజెన్స్ వ్యవస్థ పూర్తిగా వైఫల్యం చెందినని ఆయన మండిపడ్డారు. ఈమధ్య కాలంలో హిందువుల పండుగలలో, మరో పర్వదినం వచ్చినప్పటికి రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట ఎదో ఒక ఘటన జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. తిరుపతిలో జరిగిన ఘటన మరిచిపోక ముందే మొన్న సింహాచలం లో జరిగిందని, నాలుగు రోజుల కిందట ఈఘటనలో తొమ్మిది మంది మరణించడం చేలా దురదృష్టకరమైన ఘటన అన్నారు. దినికి బాధ్యత కలిగిన ప్రభుత్వం అధికారులు సంఘటన జరిగిన ప్రతిసారి ఎదో కుంటి సాకులు చెప్పి దాని నుంచి తప్పించుకోవడానికి చూస్తున్నారు తప్ప, మళ్ళీ ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం, అధికారులు తీసుకోవలిసిన చర్యలు శున్యం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్రి సీతమ్మ, అఖిలేష్ యాదవ్, ధర్మాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546